

మేము కొత్తగా విజయవాడ వచ్చిన రోజులవి.

మావారు ఆఫీసరుగా ప్రమోషను మీద వచ్చారు.

ఇల్లు—అదీ కంపెనీ వాళ్ళే ఇచ్చారు, చాలా పెద్ద ఇల్లు!

నేను ఇంట్లో అన్నీ సర్దుకుంటుంటే—మావారు హెల్ప్ చేస్తున్నారు—మధ్య

మధ్యలో వాళ్ళ ఆఫీసు కబుర్లు చెప్తూ.

మావారికి తనదగ్గిర ఎవరు పనిచేస్తున్నా వాళ్ళని గురించి డిటెయిల్డ్ స్టడీ చేయడం బాగా అలవాటు. స్టడీ చేసినంత వివరంగానూ నాకు వర్ణించి చెప్తూ వుంటారు.

ముందు ఇంట్రడక్టరీగా ఒక్కొక్కరి గురించి చెప్పుకొస్తున్నారు

ఆయన చెప్పిన వాళ్ళల్లో నాకు కుతూహలం కలిగించింది-ఆయన క్లర్కుల్లో ఒకడైన కొండయ్య గురించి.

"పాపం కొండయ్య చాలా మంచివాడు. ఆయనకి ముగ్గురుపిల్లలు. ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు, భార్య పోయిందిట-మూడేళ్ళకిందట కాన్సర్‌తో-పిల్లలు తాత నాయనమ్మల దగ్గిర వుంటారు. ఈయనిక్కడ ఒక్కడే వుంటాడు. చాలా డెడికేటెడ్ వర్కర్," అని మావారు చెప్తుంటే నా మనసులో కొండయ్యంటే సానుభూతి ఏర్పడిపోయింది. పాపం పిల్లల్ని ఒక్కడూ ఎట్లా నిభాయించుకుంటాడో — అందులో ఆడపిల్లలకి తల్లి అవసరం ఎంతైనా వుంటుంది కొంతలో కొంత నయం-ఆతడికి తల్లి తండ్రీ అన్నా వున్నారు" అనుకున్నాను.

మా అమ్మ పోయినప్పటి మా ఇంటి పరిస్థితి గుర్తుకువచ్చి నాకు మనసు కలత బారింది. కళ్ళు చెమర్చాయి.

"మరీ అంత సెన్సిటివ్ అయితే ఎట్లా వీణా...నువ్వు అన్నిటికి బాధపడతావు" నా కన్నీరు తుడిచారు మా వారు

"నేను ఎందుకు చెప్పానంటే అతడికి ఇల్లు కావాలిట, మంచి ఇల్లు దొరికేదాకా మన అవుట్ హావుస్‌లో వుంటా నంటున్నాడు. నిన్నడిగి చెప్తామని-నువ్వు సరేనంటే అతడికి చెప్తాను...."

"పోనీ ఇవ్వండి ...పాపం ఒకడేగా.... మనకేం కష్టం....వుంటాడు మనతో బాటే" అనేశాను చప్పున

ఆ తరువాత ఒక వారం లోపలే కొండయ్య వచ్చి చేరాడు—మా అవుట్ హావుస్‌లో.

చేరడానికి ముందు మా ఇంటికి వచ్చాడు.

నేను నిర్ఘాంత పోయాను ఇతడేనా కొండయ్యంటే అని!

లేటెస్ట్ స్టైయిల్ పాంట్, బొమ్మలూ చారలూ వున్న బుష్ కోటూ ...నోట్లో కిళ్లీ..అప్పుడే సిగరెట్ పారేసినట్లున్నాడు వాసనింకా వస్తూనే వుంది!

చూస్తుంటే నా మనసులో వున్న కొండయ్య బొమ్మకీ కొండయ్యకీ పోలికే లేదు.

కొండయ్యంటే వున్న సానుభూతి చోటులో ఎందుకో గాని-జుగుప్స చోటు చేసుకుంది.!

నా మనసులో రకరకాల ఆలోచనలు-

జల్సా చెయ్యడానికి కాబోలే - పిల్లల్నెందుకు దగ్గిరుంచుకోడు? ఒక్కడే వుండడం ఎందుకు? అసలా మాటకొస్తే తల్లీ-తండ్రీ - పిల్లలందరితో కలిసే వుండచ్చు. ఇతడు చేసే ఉద్యోగానికి వేరే ఇల్లు-దానికి అద్దె-ఇవన్నీ ఎందుకు? తల్లిలేని పిల్లలకి తండ్రి ప్రేమ కూడా లేకుండా చేస్తున్నాడు. పైగా హోటల్లో భోజనంట!

మా వారితో ఇదే అంటే-"ఆఁ అవన్నీ మనకెందుకు? మనతో మంచిగా మర్యాదగా వుంటాడు. అది చాలదూ," అన్నారు.

ఏమాట కామాటే చెప్పుకోవాలి మాతో మంచిగానే వున్నాడు.

మాతో ఎప్పుడూ మాట్లాడినా తన మీద మాకు సానుభూతి కలగాలన్నట్లు మాట్లాడే వాడు.

"ఇంక నాకేముందండీ జీవితంలో. ఈ

మాధవపెద్ది పుణ్యశీలా ప్రసాద్

పిల్లల బాధ్యత అయ్యాక-నాకున్న వన్నీ అమ్మేసి నేనే ఆశ్రమానికో వెళ్ళిపోతాను" అనేవాడు. అట్లా అంటుంటే నిజంగానే జాలేసేది.

దాదాపు మావారి వయసే వుంటుంది అతడికి పాపం-సంసార సుఖం లేదుకదా అనిపించేది.

"నేను ఎక్కువగా ఇంటికెళ్ళనండీ-వెళ్ళా నంటే మా అమ్మకీ నాకూ పోట్లాటే ..." అన్నాడొకరోజు.

"అదేం?" అన్నాను-నేను కాఫీ ఇస్తూ.

"ఏముంది? మళ్ళీ పెళ్ళి చేసుకోమంటుంది. మళ్ళీ నన్నొక పంజరంలో పెట్టి నాకు బంధాలు తగిలించాలని చూస్తోంది. ఆవిడ."

"పోనీ - చేసుకోండి పెళ్ళి" అనలేక పోయాను-నేను. అసలే తల్లిలేని పిల్లలు-ఆ బాధ ఒక్కటే వుంటే ఇంకా దానికి సవతి తల్లి బాధ కూడా తోడయితే...? అని పించింది.

ఒకరోజు రాత్రిపూట భోజనాల టైములో వున్నాడు మా ఇంట్లో.

నేను భోజనానికి లేవమన్నాను.

"వద్దండీ" అన్నాడు.

నేను మొహమాటమేమో అనుకున్నాను. కాదుట. అతడు ఒక్కపూటే భోంచేస్తాడుట!

"ఎందుకండీ ఈ శరీరాన్ని ఎట్లాగో బతికించుకోడానికేగా? ఒక్కపూట భోజనం చాలు. అందులో కూడా ఉప్పు, కారం బహు తక్కువ తింటాను నేను. అసలు పూర్తిగా వుండవనే చెప్పాలి."

అంటే? ఒక విధంగా బ్రహ్మచర్యం అవలంబిస్తున్నాడా?

అని వేమనకోవాలా?

ఏదీ నిర్ణయించుకోలేక పోయాను నేను!

కొండయ్య మా అవుట్ హౌస్‌లో చేరి రెండు నెలలు గడిచాయి

సిగరెట్ వాసనలూ రేడియో కేసెట్ల పాటలూ వచ్చేవి-వినవచ్చేవి.

ఆ పాటల్లో ఎక్కువగా విరహ గీతాలే వుండేవి. నేను-మావారూ "పాపం" అనుకునేవాళ్ళం.

పెద్దగా డిస్టర్బెన్సేమీ లేదనే చెప్పాలి.

ఆ రోజు కొండయ్య ఇంట్లోంచి ఏవో ఆడ గొంతులు వినిపించాయి.

ఎవరా అని మేమాశ్చర్య పోయాము. ఎవరైనా బంధువులేమో అనుకున్నాము.

అది మొదలు ప్రతిరోజూ పన్నెండు గంటల దాకా ఆడగొంతులు-గాజులచప్పుళ్ళు వినబడుతూనే వుండేవి.

కొండయ్యని పిల్చి నేనేదన్నా అంటానని ముందరే ఊహించారేమో మావారు. నన్ను హెచ్చరించారు అట్లాంటి పనేమీ చెయ్యద్దని.

నేను అతి కష్టం మీద వూరుకున్నాను.

మా ఇంట్లో పని చేసే అమ్మాయి "కొండయ్యగారు అడిగాడు వాళ్ళింట్లో కూడా చెయ్యమని, చెయ్యనా?" అని నన్నడిగింది

పోనీ చేస్తే ఏం? దానికీ రెండ్రూపాయలు వస్తాయికదా అని నేను సరేనన్నాను.

అదీ చిన్నది-పెళ్ళయింది. కానీ పిల్లల్లేరు.

అది వాళ్ళింట్లో పనిచెయ్యడం ప్రారంభించింది.

రోజులు గడుస్తున్నాయి.

ఒకసారి తన పిల్లలు ముగ్గుర్ని తీసుకువచ్చి నాలుగు రోజులుంచుకుని పంపించాడు కొండయ్య.

కూతుళ్ళిద్దరూ ముచ్చటగా విరిసిన పువ్వుల్లాగా వున్నారు.

పెద్దపిల్ల పదహారేళ్ళది-

చిన్నపిల్ల పన్నెండేళ్ళది-

పిల్లవాడు ఎనిమిదేళ్ళవాడు-

వాళ్ళనాన్న పరిచయం చెయ్యగానే వంగి కాళ్ళని నమస్కారం చేశారు ఆడ పిల్లలు.

వాళ్ళని చూస్తే నా మనసు కరిగి

పోయింది. ఆ నాలుగు రోజులూ ఎక్కడికో అక్కడికి తీసికెళ్ళాడు వాళ్ళనాన్న. ఏవేవో కొనిపెట్టాడు.

ఒకరోజల్లా మాతో గడిపారా పిల్లలు. ఎంతో చక్కగా పనీ అదీ చేస్తూ నవ్వుతూ కలుపు గోలుగా వుండే ఆ పిల్లలంటే నాకు ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది.

మళ్ళీ కొండయ్య భార్య గురించి చెప్తూ "నాభార్య నేనంటే ఎంతో ప్రేమగా వుండేదండీ. చివ్వరి క్షణం వరకూ నన్ను తన పక్కనించీ కదలనివ్వలేదు. వాళ్ళమ్మగానీ-మా అమ్మగానీ-ఎవ్వరూ అక్కర్లేదంది. నేనుంటే చాలంది-" అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

ఆ పిల్లల్నీ—అతడ్నీ ఆ విధంగా చూస్తుంటే నాకు కడుపు తరుక్కు పోయింది.

ఓదార్పు వచనాలని పలికాను.

నన్ను చూసి మావారు పక పకా నవ్వారు!

"ఏమిటి-నీకు నిమిషానికో అభిప్రాయం" అని! ఒక రోజు నెందుకో అవుట్ హౌసు వైపు యథాలాపంగా చూసిన నేను ఆశ్చర్య పోయాను. తలుపు తెరిచి వుంది.

లోపలగదీ- అంతా స్పష్టంగా కనబడు తుంది.

ఆ గదిలో సోఫా కం బెడ్ మీద మా పని మనిషి కూచుని వుంది!

పని మనుషుల్ని కుర్చీల్లో పక్కలమీదా కూచో బెట్టుకునే అలవాటు నా కెప్పుడూ లేదు. అది మా ఇంట్లో ఇన్ని రోజులుగా చేస్తున్నా ఎప్పుడూ చెయ్యనూ లేదు-!

అయినా కొండయ్యింట్లో ఎవరూ ఆడ వాళ్ళూ లేరు. పిల్లలూ వెళ్ళి పోయారు. దీనికింత చనువేమిటంట?

ఆ తరువాత అడుగుదామని నా నాలిక చివరి వరకూ వచ్చినా-నా కెందుకులే-నా ఇంట్లో చెయ్యలేదు కదా....అని వూరు కున్నాను.

తరువాత్తరువాత అది కొండయ్య లేక పోయినా ఆయనింట్లో పని చేసుకోవడం— స్నానం అదీ కూడా అక్కడే చెయ్యడం గమనించాను నేను. అది దానిల్లులాగే వాడు కుంటోందా?

ఏమిటో నా కిట్లాంటివి అసహ్యాన్ని కలిగిస్తాయి.

రోజులు జరిగి పోతూనే వున్నాయి.

రాత్రుళ్ళు అవుట్ హౌస్‌లో ఆడ గొంతులు వినబడుతూనే వున్నాయి.

పని మనిషి దానిపని అది చేసుకు పోతూనే వుంది. కానీ పనిలో కాస్త అశ్రద్ధ కనబడింది నాకు ఎందుకో మరి!

ఎందుకా అని ఆలోచిస్తున్న నాకు ఒక రోజు పొద్దున్నే ఏలక్కాయ నములుతూ పనిలోకి వచ్చిన పని మనిషి కనబడింది.

"ఏమిటి సంగతి" అనడుగుతే చెప్పింది.

"అన్నం సహించటం లేదు రెండు నెలల నుంచీ అనుమానం" అని!

"చాలాసంతోషమే అమ్మా" అన్నాను.

ఏమి అపురూపమో గాని తరువాత నెలకే నేను చెయ్యలేనంటూ పని మానే సింది.

మా ఇంట్లో మానేసిన వారానికి గూడా అవుట్ హౌస్‌లో పని చేస్తూ కన బడింది.

నాకు ఒళ్ళు మండింది.

నాకింకా పని మనిషి కుదర్లేదు.

"మా ఇంట్లో పని చెయ్యలేని దానివి-అక్కడ ఎట్లా చేస్తున్నావని" అడిగాను ఉండబట్టలేక.

అంతే-అక్కడా మానేసింది.

ఆ తరువాత అదే ఆలోచిస్తున్న నాతో మావారు "ఏమిటి-ఆలోచన ? ఔవుట్ హౌస్‌కీ-పని మనిషికీ వున్న సంబంధాన్ని గురించా?" అన్నారు, హాస్యంగా.

నేను ప్రశ్నార్థకంగా చూశాను.

ఆయన నవ్వారు.

మరో ఆరు నెలలు గడిచాయి.

మా వారు ఆఫీసు విషయాల్లో అవినీతిని గురించి చెప్తూ-ఈ మధ్యన ప్రవర్తన-నడత

సరిగ్గా లేనివాళ్ళని ఇద్దర్ని సస్పెండు చేశామనీ-మరో ఇద్దరికి గట్టి వార్నింగులు ఇచ్చామనీ చెప్పారు వాళ్ళెవరెవరో పేర్లు మాత్రం నాకు చెప్పలేదు.

కానీ

మా అవుట్ హౌవుస్‌లో ఆడ గొంతులు వినిపించడం మానేశాయి.

నేను హాయిగా నిట్టూర్పు విడిచాను.

ఒక రోజు కొండయ వచ్చాడు మా ఇంటికి.

ఈ మధ్య అతడు వచ్చి చాలా రోజులే అయింది. నేను కుశల ప్రశ్నలు వేస్తుండగా చెప్పాడు.

“తన పిల్లలకి పెళ్ళి” అని!

“చాలా సంతోషం. అయినా రెండో పిల్ల మరీ చిన్న పిల్ల కదా. పన్నెండేళ్ళ కేనా?” అన్నాను

“మంచి సంబంధాలు కుదిరాయండీ చేసేస్తే నా బాధ్యత తీరుతుంది. మళ్ళీ నే నెట్లా వుంటానో... మా అమ్మా నాన్న పెద్దవాళ్లు .... అయినా చిన్నపిల్ల పెళ్ళయినా అత్తారింటికి కొన్నాళ్ళయ్యాకే వెళ్తుంది లెండి” అన్నాడు. ఈ రోజుల్లో ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు కావడం విడ్డూరమే మరి!

కానీ అది వాళ్ళిష్టం. ఇదీ ఒకందుకు మంచిదేనేమో. “ఎడోలిసెన్స్” అమ్మాయిలు బాయ్‌ఫ్రెండ్స్ కావాలనుకుంటే భర్తలతోనే తిరగొచ్చు. ఆరోగ్యకరం!

“ముహూర్తాలు కూడా పెట్టుకున్నామండీ ఇంక రెండు నెలలలోనే పెళ్ళిళ్లు. మావూళ్ళోనే ... మీరు తప్పకుండా రావాలి”

“తప్పకుండా వస్తాం” అన్నాను.

అతడెళ్ళిపోయాడు.

కొండయ పెళ్ళి పనుల మీద హడావిడిగా తిరుగుతున్నాడు. పెళ్ళి పల్లెటూరులోనేమో-ఇక్కడ్నించి చాలా చేరేస్తున్నాడు.

పెళ్ళి దగ్గిరిలో కొచ్చింది. ఇంక ఒక నెలే వుంది కొండయ్య ఇంటికి ఎవరెవరో వచ్చి పోతూనే వున్నారు.

ఆరోజు-

నేను బయటి గేట్లోనించి ఇంట్లోకి వస్తుంటే-కొండయ్య ఎదురుపడి నమస్కారం చేశాడు.

నేను పెళ్ళి విశేషాలడుగుతూ “మీ ఇంటికి చాలామందే గెస్టులు వస్తున్నారే వియ్యాల వారా?” అన్నాను.

అతడు ఎందుకో తడ బడుతూ తల వంచుకున్నాడు.

నా కాశ్చర్యం వేసింది.

“మా పేరెంట్స్ వచ్చారండీ....ఇంకా, ఒక విధంగా వియ్యాలవారే...”

అన్నాడు మెల్లిగా.

“అంటే? ఒక విధంగా ఏమిటి?” అన్నాను.

“మానాన్న-అమ్మా నాకు సంబంధాన్ని మాట్లాడుతున్నారు” అన్నాడు.

“మీకా?” అన్నాను తెల్లబోయి.

“అవును-నన్ను ఒకటే బలవంత పెడుతున్నారు. వాళ్ళు అంతగా బలవంత పెడుతుంటే కాదన లేక పోయాను.”

నాలో ఏవేవో ఆలోచనలు.

“సంబంధం సెటిలయినట్లే........ఆ అమ్మాయి మా కులం కాదు. ఇంకోటేమిటంటే ఆ అమ్మాయిది కూడా ఒక రకంగా నా లాంటి కేసే .. డైవర్స్‌డ్ .......ఒక ఆడపిల్ల కూడా వుంది.”

చెప్తున్నాడు కొండయ్య-

అయితే ఆదర్శ వివాహ మన్నమాట-

కొంత వరకూ మంచి వాడే... కన్నె పిల్లల వరకూ పోలేదు.

"అయితే మీ పిల్లల పెళ్ళిళ్ళవంగానే మీ పెళ్ళన్న మాట-" అన్నాను.

"కాదు ఈ లోపతే అంటున్నారు. పెళ్ళంటే పెద్ద ఆడంబరంగా కాదు. ఒక చిన్న ఫంక్షన్ లాగా గుళ్ళోనే కానిస్తాం."

"మంచిది, చాలా సంతోషం-" అన్నాను.

"ఆ భార్య మీద వున్న ప్రేమా-బ్రహ్మచర్యం-అన్ని ఏమయి పోయాయి?" అదే అన్నాను మావారితో.

"ప్రపంచంలో మనుషులు అనేకరకాలు" అంటూ మావారు నాకింకో విచిత్ర వార్త చెప్పారు. ఈయన చేసుకోబోయే అమ్మాయిని భర్త వదిలెయ్యలేదు. భర్తనే ఈవిడ వదిలేసింది.

భర్తకి పిచ్చి. అదీ కారణం.

మెంటల్ హాస్పటల్లో వున్నాడాయన.

అందుకని ఈవిడ ఇంకో పెళ్ళి చేసుకుంటోంది! నా తల తిరిగి పోయింది.

ఇదే దేశం? భారత దేశమేనా?

ఈదేశ సంస్కార మేమిటి?

భర్త బతికి వుండగా భారత స్త్రీ ఇంకో పెళ్ళి చేసుకోడమా?

భర్తకి పిచ్చి-అయితే నయం కాదూ? నయం కాదే అనుకో అయినా అర్ధాంగి-మనస్థితి సరిగ్గా లేని భర్తని చూసుకుంటూ ఆయనకి చేయూత నిచ్చి ఆ పిచ్చి నయం కావడానికి దోహదం చేసి మామూలు మనిషిని చేసుకో నక్కర లేదా?

ఆయన ఖర్మానికి ఆయన్ని వదిలి

తను వేరే పెళ్ళి-దేనికి?

తుచ్ఛమైన శరీర సుఖాలకోసం చేసుకొని సుఖిస్తుందా అది సుఖమా?

దేనికోసం ఈ పెళ్ళి? తనకి భవిష్యత్తులో చూసుకోడానికి తను కడుపున కన్న పిల్లుంది అంత వరకూ అండ దండలుగా తల్లి దండ్రులున్నారు — అన్నదమ్ములున్నారు-డబ్బుంది.

ఇంకెందుకు మరో పెళ్ళి

ఆ భర్తకి నయమయి వస్తే ఆయన సంగతి?

కనీస మానవ ధర్మం-స్త్రీ హృదయం, కరుణ, జాలి, కనికరం అన్నా వుండాలి. ఏవి, ఎక్కడున్నాయి?

నాకు నేను ఎప్పుడో కొన్ని సంవత్సరాల కిందట చదివిన కోమలాదేవి గారి నవల "బంగారు పంజరం" గుర్తొచ్చింది.

అందులో నాయిక భర్తకి పిచ్చి పడుతుంది. యావజ్జీవం ఆయనతో వుండి, సేవలు చేసి అహర్నిశలూ కనిపెట్టుకుని వుండి చాలా ఏళ్ళకి దాదాపు వార్ధక్య దశలో ఆయనకి పిచ్చి తగ్గితే అప్పుడు ఆయనతో సంసార జీవితం సాగిస్తుంది. ఎవరేమన్నా లెక్క చెయ్యదు. ఎన్నో కష్టాలు ఎదుర్కొంటుంది.

అవునుమరి. పెళ్ళంటే అది కేవలం మూడు ముళ్ళ బంధమే కాదు.

అది జీవితానుబంధం జన్మజన్మల బంధం. లేకపోతే పెళ్ళికి అర్థం ఏమిటి?

మాంగల్యానికి విలువ ఏమిటి?

సుఖంగా వున్నన్నాళ్ళూ సుఖించి, కష్టంలో వున్నప్పుడు ఆయన మాంగల్యం ఆయనకి పడేసి తను మరోపెళ్ళి చేసుకోడం భార్యకి; భార్య కష్టంలోవుంటే తన కష్టానికి తనని వదిలేసి-మరో పెళ్ళి చేసుకోడం భర్తకి న్యాయమేనా? ధర్మమేనా-కాదు-కాదు.

ఇది చాలా అన్యాయం. నా మనసు ఘోషించింది.

మావారు అనునయంగా నా భుజం మీద చెయ్యేశారు.

"నువ్వు అతిగా ఆలోచించి నీ మనసుని పాడు చేసుకోకు వీణా .... మంచిదానివి కదూ?"

నన్ను లోపలికి నడిపించుకు వెళ్ళారు మావారు.